# 27

# ఒక విరామము: యేసు వెనుదిరుగుట

## (12:15-21)

యేసుకు విరోధముగా ఒక కుట్ర చేయబడుచుండినది. అకాలపు నిర్బంధమును నిరోధించునట్లు, ఆయన మరొక పర్యాయము తన శిష్యులతో కూడ సముద్రము వైపుగా వెనుదిరిగాడు (మార్కు 3:7). సరైన సమయము వచ్చినప్పుడు యేసు సాహసోపేతంగా మరణించును, కానీ ఆ సమయము యింకను రాలేదు.[1]

### ఒక విరామము (12:15, 16)

**[15]యేసు ఆ సంగతి తెలిసికొని అచ్చటనుండి వెళ్లిపోయెను. బహు జనులాయనను వెంబడింపగా [16]ఆయన వారినందరిని స్వస్థపరచి, తన్ను ప్రసిద్ధిచేయవద్దని వారికి ఆజ్ఞాపించెను.**

**వచనములు 15, 16.** ఒక క్షణమైనా సేద దీర్చుకొనవలెనని యేసు ప్రయత్నించు చుండినప్పటికిని, జనసమూహములు ఆయనను **వెంబడించుచుండినందునుబట్టి** వీలు కాలేదు. వారు గలిలయనుండియు, యూదయ నుండియు, యెరూషలేము నుండియు, ఇదూమయ నుండియు, యొర్దాను అవతల నుండియు, తూరు మరియు సిదోను ప్రదేశముల గుండా పయనించారు (మార్కు 3:7, 8). వీటిలో కొన్ని పట్టణములు అన్యజనులు నివసించుచుండిన ప్రదేశములలో ఉండినందు వలన, యేసును గుంపులు గుంపులుగా వెంబడించుచుండిన జనసమూహములలో అన్యజనులు సహితము ఉండియుందురు (మత్తయి 12:18). ఆయనను వెంబడించుచుండిన వారిలో అనేకులు రోగులై యుండిరి, గనుక **ఆయన వారినందరిని స్వస్థపరచాడు.**

ఆయన ఇది వరకు తరుచుగా చేయుచుండినట్లు మరియు మరలా చేయనై యుండినట్లు, **తన్ను ప్రసిద్ధిచేయవద్దని యేసు వారికి ఆజ్ఞాపించెను** (8:4; 9:30; 16:20; 17:9). ఆయన చేసిన హెచ్చరిక "మెస్సీయ సంబంధిత రహస్యము" అని చెప్పబడినది.

### దేవునికిష్టుడైన సేవకుడు మరియు అన్యజనుల ప్రబోధకుడు (12:17, 18)

**[17]ప్రవక్తయైన యెషయాద్వారా చెప్పినది నెరవేరునట్లు (ఆలాగు జరిగెను) అదేమనగా–**

**[18]ఇదిగో ఈయన నా సేవకుడు**
**ఈయనను నేను ఏర్పరచుకొంటిని**
**ఈయన నా ప్రాణమునకిష్టుడైన నా ప్రియుడు**
**ఈయన మీద నా ఆత్మ నుంచెదను**

**ఈయన అన్యజనులకు న్యాయవిధిని ప్రచురము చేయును.**

**వచనము 17.** మత్తయి, పరిశుద్ధాత్మ చేత నడిపింపబడినవాడై, యేసు చేపట్టిన చర్యలు ప్రవచనముల నెరవేర్పని అనువదించుట కొనసాగించాడు (1:22పై గల వ్యాఖ్యానమును చూడు). ఈ సారి దేవుడు ప్రవక్తయైన **యెషయా ద్వారా మాటలాడిన మాటలను** ఆయన అనులేఖనము చేయుచు సెలవిచ్చాడు.

**వచనము 18.** 18 మొదలుకొని 21 వరకు గల వచనములలో మత్తయి రచించిన సువార్తలోని సుధీర్ఘమైన పాత నిబంధన ఉల్లేఖనము కలదు. ఈ ఉల్లేఖనము యెషయా 42:1–4లో నుండి తీసికొనబడినది. ఆసక్తికరముగా, కొన్ని మాటలు మాసోరెటిక్ గ్రంథ పాఠమునకు [Masoretic Text (MT) – యూదుల అధికారిక బైబిల్] మరియు సెప్టువజింటలోని (LXX) మాటలకు కొంచెము తేడాగా ఉన్నవి. యేసు తన ఉల్లేఖనమును అరమెయిక్ టార్గమ్ (Aramaic Targum) నుండి తీసికొని యుండవచ్చునని ఏ. డబ్ల్యు. ఆర్జిల్ సూచించాడు.[2]

ఈ గ్రంథ పాఠములో **సేవకుడు** అను అర్థమిచ్చుచున్న గ్రీకు పదము, *pais* "సేవకుడు"ను సూచించుటకు ఇతర పదములు (*doulos; diakonos* వంటివి) వాడబడినంత తరుచుగా వాడబడలేదు. *Pais* అను పదము "ఒక శిశువు" మరియు ఒకరి "సంతానము" అని కూడ అనువదింపబడవచ్చును. ఈ పద ప్రయోగమునకు వేదాంతశాస్త్ర సంబంధమైన ప్రాముఖ్యత కలదు. తండ్రి/కుమారుడు మరియు యజమానుడు/దాసుని గూర్చిన మన కల్పనలో దేవునితో యేసు కలిగియున్న సంబంధమును గూర్చిన సందర్భము ఎలా పరిగణింపబడగలదో యని ఒకరు పునఃరాలోచించునట్లు అది వానికి తోడ్పడును. Pais అను పదము యేసును దేవుని సేవకునిగా మనముందుంచుచు ఇతర వాక్యభాగములలో సహితము అన్వయింపబడినది (అపొస్తలుల కార్యములు 3:13, 26; 4:27, 28, 30).

యెషయా 42 యొక్క మూల గ్రంథ పాఠము సందర్భములో, దేవుని "సేవకుడు" అనునది ఇశ్రాయేలును సూచించినది, మెస్సీయాను కాదు. సెప్టువజింట్‌ను అనువదించిన యూదులు, బహుశా దీనికి ముందటి అధ్యాయములో నుండి (యెషయా 41:8) దానిని అరువు తెచ్చుకొని, యెషయా 42:1ని "ఇదిగో నేను ఆదుకొను నా సేవకుడు, నేను ఏర్పరచుకొనినవాడు ..." అని మొదలుపెట్టి యుందురు. ఈ అనువాదము అసాధ్యమైనదేమి కాదు, ఏలయనగా పాత నిబంధన ప్రవచనములు తరుచుగా ద్వంద్వ నెరవేర్పులు కలిగియుండును. ఏదిఏమైనా, ఈ అధ్యాయములో (యెషయా 42:6, 7 చూడు) నున్న మెస్సీయా సంబంధిత కోణములు స్పష్టముగా నున్నవి. యేసు గూర్చి, దేవుని చిట్టచివరి సేవకుని గూర్చి, యెషయా ప్రయోగించిన భాషను మత్తయి కూడ ప్రయోగించాడు. ఈ వాక్యభాగములోని పదజాలము (**నా ప్రాణమునకు ఇష్టుడైన నా ప్రియుడు**) యేసు బాప్తిస్మము పొందిన తరువాత మరియు యేసు రూపాంతరము చెందిన తరువాత దేవుని చేత పలుకబడిన అదే విధమైన మాటల వలె నున్నది (3:17; 17:5).

యేసు **పరిశుద్ధాత్మచేత** అభిషేకింపబడు సందర్భమును యెషయా ప్రవచనము ముందుగా తెలియజెప్పినది. యేసు బాప్తిస్మము పొందినప్పుడు, పరిశుద్ధాత్మ ఆయన మీదికి దిగివచ్చాడు (3:16). యేసు "పరిశుద్ధాత్మతో బాప్తిస్మమిచ్చువాడై" యుండెనని

(యోహాను 1:30–33) ఇది బాప్తిస్మమిచ్చు యోహానుకు ఇవ్వబడిన ఒక చిహ్నమై యుండినది. అపొస్తలుల కార్యములు 10:38లో పేతురు, “దేవుడు నజరేయుడగు యేసును, పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెనని మీకు తెలియునని” తెలియజెప్పాడు.

**ఆయన అన్యజనులకు న్యాయము ప్రకటించునని** ప్రవక్తయైన యెషయా పలికిన ప్రవచనమును యేసు నెరవేర్చాడు. ఇది యేసు యొక్క ప్రాథమిక బృహత్కార్యభారము కాకపోయినప్పటికిని (10:6; 15:24), ఆయన ప్రబలంగా అన్యజనులకు పరిచర్య చేసాడు, మరియు అన్యజనులుండిన ప్రదేశాలలో వారికి బోధించాడు. వాస్తవమునకు, “గొప్ప విశ్వాసము” కలిగియున్నారని ఆయన ప్రశంసించిన ఇద్దరే ఇద్దరు వ్యక్తులు అన్యులై యుండిరి (8:5, 10; 15:22, 28).

## శాంతియుతమైన నాయకుడు (12:19–21)

**19ఈయన జగడమాడడు, కేకలువేయడు**
**వీధులలో ఈయన శబ్దమెవనికిని వినబడదు**
**20విజయమొందుటకు**
**న్యాయవిధిని ప్రబలము చేయువరకు**
**ఈయన నలిగిన రెల్లును విరువడు**
**మకమకలాడుచున్న అవిసెనారను ఆర్పడు**
**21ఈయన నామమందు అన్యజనులు నిరీక్షించెదరు అనునదే.**

**వచనము 19.** యేసు **జగడమాడడు, కేకలువేయడను** వాస్తవము ఆయన ఎన్నడును చర్చలలో నిమగ్నుడై యుండడని లేదా ఎన్నడును సంఘర్షణలు ఎదుర్కొనడని అర్థమీయదు. దానికి మారుగా, ఆయన తన చిత్తమును ఇతరులపై బలవంతముగా రుద్దడను వాస్తవమును ఇది సూచించుచున్నది. యేసు ఒక స్థలంలో తృణీకరింపబడినపుడెల్లా, ఆయన అచ్చోటను విడిచిపెట్టి మరొక చోటికి వెళ్లుచుండెను. ఆయన రాజకీయ లబ్ధి నిమిత్తము ప్రజాదరణ పొందు ప్రజాభిప్రాయమును రెచ్చగొట్టుటకు అల్లరి మూకలను పురికొల్పువాడు కాడు.

**వీధులలో ఈయన శబ్దమెవనికిని** వినబడదను ప్రస్తావన యేసు తన పరిచర్యను ఎంతో వినయముతో చేయునని చెప్పుచున్నది. ఆయన అందరి దృష్టిని తన వైపే ఆకర్షించుటకు ప్రయత్నించలేదు, కానీ ఆయన తన దృష్టిని ఇతరుల అవసరములపై కేంద్రీకరించాడు. ప్రజల హృదయములలో ఆయనను గూర్చిన తప్పుడు అభిప్రాయమును కలుగజేయకుండునట్లు ఆయన చేసిన అనేకమైన అద్భుతకార్యములు ఏకాంతముగా చేయబడినవి. దీనికి సంపూర్తియైన తారతమ్యములో, వారు ధర్మము చేయునప్పుడు మరియు “వీధుల మూలలలో నిలచి ప్రార్థన చేయునప్పుడు” మనుష్యులందరు చూచునట్లు “వారి ముందర బూర ఊదింపబడవలెనని.” పరిసయ్యులు కోరుచుండిరి (6:2, 5).

**వచనము 20.** యెషయా చేత ప్రయోగింపబడిన రెండు ప్రతిరూపములు యేసు త్రోసివేయనివారు, శారీరకముగాను ఆధ్యాత్మికముగాను అనారోగ్యముగా నుండినవారికి ప్రతినిధులై యుండినవి. మొదటిది, **ఈయన నలిగిన రెల్లును విరువడు.** రెల్లు, పెన్నులు, పిల్లనగ్రోవులు, మరియు కొలబద్ధల వంటి అనేక విభిన్న వస్తువులను తయారుచేయుటకు

ఉపయోగింపబడినది.[3] రెల్లు విస్తారముగా అందుబాటులో ఉండినది గనుక (11:7పై గల వ్యాఖ్యానమును చూడు), నలిగిన లేక వంచబడిన రెల్లు పారవేయబడి దానికి బదులుగా మరొకటి సులభముగా తీసికొనబడుచుండినది. **మకమకలాడుచున్న అవిసెనారను ఆర్పదు** అనునది రెండవ ప్రతిరూపమై యున్నది. దీపముల వత్తులు ఆవిసెనారతో చేయబడినవి, గనుక అవి సరిగా పనిచేయనట్లయితే వాటికి బదులుగా మరొకటి సులభముగా మలచబడినది.[4] మరొక పర్యాయము, యేసు క్రీస్తు యొక్క సాధుత్వము నొక్కివక్కాణింపబడినది (11:29 చూడు). యేసు "వారి గాయములను స్వస్థపరచు విధానమును, అంతకంతకు అధికంగా క్షిణించిపోవుచుండు వారి బలహీనతలను మరొకసారి మండించు తీరును" గూర్చి జే. డబ్ల్యు. మెక్‌గార్వే వ్యాఖ్యానించుచున్నాడు.[5] తీర్పు నాటి వరకు కూడ–అనగా, **విజయమొందుటకు న్యాయవిధిని ప్రబలము చేయువరకు**, అణగద్రొక్కబడుచుండిన వారి యెడల ఆయన తన కనికరమును కనుపర్చుచుండును.

**వచనము 21.** మెస్సీయ యందు **అన్యజనులు నిరీక్షించెదరు** అను వాస్తవము మత్తయి రచించిన సువార్త యందంతటను గల ఒక ఇతివృత్తమును కొనసాగించుచున్నది (2:1–12; 4:15, 16; 8:5–13; 10:18; 12:18; 15:21–28; 24:14; 28:19).

---

సూచనలు

[1]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 308-9. [2]A. W. Argyle, *The Gospel According to Matthew,* The Cambridge Bible Commentary on the New English Bible (London: Cambridge University Press, 1963), 93. [3]Morris, 311. [4]Ibid. [5]J. W. McGarvey, *The New Testament Commentary,* vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 106.